కథానిక:

# పరిణామం

నాలా బాధ పడి ఉదయం పదిగంటలకు తనే స్వయంగా వండుకొని తిన్న అన్నం- తిన్నాడన్న మాటే గానీ ఏమీ సహించకపోవడంచేత ఎంగిలి పడ్డ చేతినిమాత్రం కడుక్కున్నాడు. అంతే!... మధ్యాహ్నం కాఫీ కూడా త్రాగలేదు. మరి అలా ఆఫీసులో ఆకలితో కూర్చోడం కష్టమనిపించింది రామానికి.

ఫైల్సు అన్నీ అరలలో సర్దేసి ఆఫీసరు నడిగి సెలవు తీసుకొని బయలుదేరే డింటికి. సమంగా గంటస్థంభందగ్గర కొచ్చేసరికి నాలుగు గంటలయింది. ప్రక్కనే ఉన్న కాఫీ హోటలులోంచి 'గమ్' అని దోశ వాసన వేసింది. తనకు సహజంగా కలిగిన ఆకలికి మరింత దోహదం అయిందా దోశ వాసన. జేబు తడిమి చూచుకున్నాడు. రెండణాలు చేతికి తగిలేయి.... రెండణాలూ ఇచ్చి దోశ తినేస్తే, మరి కాఫీకి డబ్బులో?——పోనీ కాఫీ ఎలానూ ఇంటిదగ్గర త్రాగుతాడుగనక, ఆ బేడ ఇచ్చి దోశ తినేస్తేనో!... అన్నట్టుగ ఇంటిదగ్గర తన అర్ధాంగి అరుణ, కాఫీ పెడుతుందని ఏమిటి నిశ్చయం? ఉదయం అన్నమే వండనిది కాఫీ ఎందుకు పెడుతుంది? అదీకాక ఆమె ఇవాళఉదయం నుంచీ నిరసనవ్రతం చేయసంకల్పించుకున్నట్టుంది! ఆఖరికి తనొండి తినమని చెప్పినా మౌనం వహించింది. నులకమంచం మధ్యని మటం వేసి కూర్చొందో తపస్వినిలా!... ఇక అలాంటి పరిస్థితిలో ఉన్న తన భార్య, తను ఇంటికి వెళ్ళేసరికి కాఫీ ఇచ్చి గౌరవిస్తుందని ఏమిటా నమ్మకం?——ఏమయినా దానికి పతిభక్తి రవ్వంతయినా లేదనుకున్నాడు. సావిత్రి, అనసూయ, పార్వతి మొదలయిన సినీమాలన్నీ చూపెట్టేడు. పతిభక్తి వాళ్లను చూచయినా అలవరచుకుంటుందేమో నని!... ఊహూ... అబ్బే! అవేవీ తలకెక్కినట్టు లేవు——

ఇంతకీ ఆరోజున ఆమెకు వచ్చిన కోపం ఏమిటి? దొడ్లో అంట్లుతోమే కాపదాన్ని మానిపించేయమంటుంది భార్య అరుణ!... దాన్ని మానిపించేయడానికి రామం ఒప్పుకోలేదు!——పైకి చాలా చిన్నదిగా కనిపించినా, వాళ్లిద్దరమధ్యా కల్లోలాన్ని లేవదియ్యడమే కాకుండా మంచి విచిత్రమయిన మరో పరిణామాన్ని కూడా కలుగజేసింది.

అరుణ, అలా కాపదాన్ని మానిపించేయమనడంలో కొంత సబబువుంది. లేకపోతే ఇంట్లో జీతానికి పనిచేసే కాపదాని కంత గర్వమేం?.... ఏరోజూనా సమంగా అంట్లు తోమడానికి వచ్చేదే కాదు. ఒకవేళ వచ్చినా మసయినా వదలకుండా ఏదో వెట్టికి తోమిచ్చేసేది. జీతం తీసుకుంటూ అలా ప్రవర్తిస్తే ఎవరొప్పుకుంటారు? "ఇదేమిటే ఇలా తోముతున్నావు, ఏదో వెట్టిచాకిరీ చేస్తున్నట్టు——ఇలా అయితే నిన్ను మానిపించేస్తాను తెలుసా!" అంది అరుణ మరి సహించలేక.

మానిపించేస్తానన్న మాట అరుణ నోటంట వచ్చిందో, లేదో, ఇంకేం!


**************************

**శ్రీ ఆకుంది నారాయణమూర్తి**

**************************


'గంయ్' మంటూ గొంతుక విప్పేసింది కాపది. "ఏటి మానిపించేస్తావమ్మా——మానిపించేయడానికి నువ్వెవు రివమ్మా! 'పైడం'టే ఏటి తెలీనిదనుకుంటున్నావేటి? నువ్వు మానిపించేసినప్పుడు మానుకుంటాను... నా తమాసా తెలుద్ది!" అందటి గర్వంతో పైడి.

అంతలా తనని ఏకవచనప్రయోగం చేసంటుందని అనుకోలే దరుణ. ఒక కాపదానిముందు తన మాట నెగ్గకపోడమనేది చాలా హేయమని భావించుకుంది. దాన్ని తప్పకుండా మానిపించేస్తేనే తను గెల్చినట్టు! అదీకాక అంత పోత్రం గల కాపదాన్ని ఇంట్లో ఉంచడం కూడా మంచిది కాదనుకొని, మానిపించేయాలని సంకల్పించుకుంది——"నీపోత్రం కట్టిస్తానుండు. బాబు రానీ." అంది అరుణ.

"బాబొచ్చి ఏటి చేస్తాడు? నువ్వన్నపాటే అననేడులే!" అంది పైడి ఇంకొంచెం గర్వంతో.

అరుణ నివ్వెరపోయింది దాని ధైర్యాన్ని చూచి. దానితో పోరుపెట్టుకుంటే అట్టే లాభం లేదనుకుంది. పట్టి కల్లు ముచ్చుముండని అనుకుంది.

భర్త ఆఫీసునుంచి వచ్చేక జరిగిన సంగతంతా చెప్పింది. దాన్ని తక్షణం మానిపించేయాలని చెప్పింది.

——"ఏదో, లోకజ్ఞానంలేని కాపముండ అలా అందని అంత పట్టింపెందుకు?... దాన్నిప్పుడు మానిపించేస్తే, నువ్వే ఇక అంట్లు తోముకోవలసి వస్తుంది తెలుసా! ఇంతకన్నా మంచి కాపవాళ్లు మరెవ్వరూ ఈ ఊళ్లో దొరకరు," అన్నాడు రామం.

భర్త అలా తనమాటకు వ్యతిరేకంగా అంటాడని అనుకోలేదు అరుణ. ఆమెకెంతో కోపంవచ్చింది. "మరెవ్వరూ అంట్లు తోమక్కర్లేదు. నేనే తోముకుంటాను!... రేపట్నుంచీ అది ఈ గుమ్మం త్రొక్కడానికి వీల్లేదు," అంది అరుణ.

"నీఇష్టం ఏమిటి మధ్యని?——నా ఇష్టం! నేను దానికి జీతం ఇచ్చేవాడిని. దాన్ని మానిపించను," అన్నాడు రామం. అలా అనేసినతరువాత, తను చాలా తెలివితక్కువ తనంగా మాట్లాడినట్టు గ్రహించాడు. మాట నోటిని దాటిన తరువాత విచారించి ఏంలాభం?...

అరుణముఖం అరుణవర్ణాన్ని దాల్చింది. ——"ఔను! అంతా మీ ఇష్టమే! మీ ఇష్టప్రకారమే, అది నన్ను ఎదిరించిందని కూడా తెలుసుకున్నాను. ఇక కొన్ని రోజులలో అదినన్ని ఇంట్లోంచి తగిలేసి అదే నా స్థానాన్ని ఆక్రమించుకుంటుందని కూడా ఇప్పుడే తెలుసుకున్నాను. ఈ విషయం ఇన్నాళ్లయి తెలుసుకోలేకపోయాను. ఇంతకీ ఇదంతా నా...." అని, కళ్లంట నీరుకారుస్తూ గదిలోకి వెళిపోయింది. అప్పటినుంచీ మొదలుపెట్టింది నిరశనవ్రతం. కాపదాన్ని మానిపించేస్తేనే గానీ తను ఏపనీ చెయ్యకపోడమే కాకుండా, అన్నం తిననని కూడా పంతం పట్టింది.

ఏం?... అలా లేని పోని అపోహలు స్వయంగా కలుగజేసుకొని, భార్యఆగ్రహానికి, అనుమానానికి పాత్రుడు అయేకన్నా చక్కా దాన్ని మానిపించ


గనోక్యూర్
అన్నిసెగలకు గంటలలో గుణము
ఈశ్వర ఫార్మశి, రాజమండ్రి.

కూడదూ? అంత పాత్రంగల కోపదాన్ని మానిపించేస్తే వచ్చిన నష్టమేమిటి?—...

దాన్ని మానిపించేయడము రామానికీ ఇష్టమే!...కానీ, ఆ...ఒక్క లొసుగూ ఉండబట్టే దాన్ని మానిపించడానికి దడ దడం!—యౌవనమదంలో కామానికి లోబడి, ఆ వీధిలోనే ఉన్న కామయ్య కూతురు లక్ష్మి, తనూ ఒకప్పుడు కామ పాశంతో బంధింపబడిన రోజు లుండేవి. ఒకరోజున లక్ష్మి తన కౌగిట్లో ఉన్నప్పుడు పైడి చూచింది!... ఆ విషయం లోకానికి తెలుబడి చేయవద్దని పైడిని బ్రతిమాలు కున్నాడు. దానికి కొంత డబ్బు కూడా ఇచ్చేడు. లక్ష్మిని పెళ్లిచేసుకుందామనే మొదట అనుకున్నాడు గానీ, కులవిష యమై సంఘానికి దడిసి ఆమెను వివాహం చేసుకోలేదు. తరువాత తనకీ వివాహ మయింది, లక్ష్మికికూడా వివాహం జరిగింది. ఆ యిద్దరూ హిందీసినీమాలు అట్టే చూడ లేదు కాబోలు! తమ ప్రేమ విఫలమయి నందుకు ప్రాణత్యాగం ఏ ఒక్కరూ చెయ్యలేదు. తను తనభార్య అరుణతో హాయిగా కాలక్షేపం చేస్తున్నాడు; లక్ష్మి ఆమె భర్తతో హాయిగా కలక్షేపం చేస్తు న్నాది పూర్వవిషయాలను మరచి. తను ఒకవేళ పైడిని మానిపించినట్లయితే అనేక విచిత్రమయిన పరిణామాలు కలుగుతాయి! ప్రశాంతంగా ఉన్న లక్ష్మి కాపురంలో తుపాను చెలరేగుతుంది—అరుణకి తనమీద ప్రేమ సన్నగిల్లడమే కాకుండా, ఇంట్లో అశాంతపరిస్థితి ఏర్పడుతుంది. కానీ... పైడిని మానిపించకపోతే ఒక చిక్కు! మానిపిస్తే ఓ చిక్కు!! ఎలా మరి?...అవా ళుదయంనుంచీ అరుణ ఏపనీ చెయ్యడం మానేసింది. పైగా అన్నం తనొండి తిన మని చెప్పినా తినలేదు—

—ఇక అలాంటి పంతంలో ఉన్నది మధ్యాహ్నం తను ఇంటికెళ్ళేసరికి కాఫీ ఎలానూ పెట్టదు!... అంచేత ఆ కాఫీ హోటల్లోకి దూరి, గొంతుకలో ఆ కాస్తా కాఫీనీళ్లు పోసుకొని బయట పడ్డాడు.

ఆ సమస్య నెలా సాల్వు చెయ్యడమా అనే ఆలోచనలో పడ్డాడు. ఆలోచిద్దామనే అభిప్రాయంతో ఉన్నాడే కానీ, తీరా ఇంటిగుమ్మంలో కాలుపెట్టినప్పటికీ, ఏమీ ఆలోచించలేకపోయేడు.

నట్టింటిలో నులకమంచంమీద తల విరగ బోసుకొని బోర్లా పడుక్కొని ఉంది తన అర్ధాంగి!...ఏ పురాణకథ చదవడం వల్లనో ఎలా అలగాలో నేర్చుకుందను కున్నాడు. నయం!... గాజుపెంకులతో బొక్కురుకోలేదు. ఏమయినా అలకలో కొంత 'మాడిఫికేషను' వచ్చిందనుకు న్నాడు ఓ అనుమానం కూడా కలిగింది. తను ఆఫీసుకు వెళ్ళిపోయినతరువాత వండుంచిన అన్నం తినేసి తిననట్టుగ నటి స్తున్నాడేమో!... అందుకే అనుమానం తీరేనిమిత్తం వంటింటిలోకి వెళ్ళి చూచేడు. ఆమెకోసం అని ఉంచిన అన్నం అలానే ఉంది. అన్నం తినకుండా ఆకలితో ఎలా ఉండగలిగిందో అని చాలా జాలిపడ్డాడు. ఆ కోపముండ హటాత్తుగా చచ్చిపోయినా బాగుండు ననుకున్నాడు. కానీ, అదంత వేగిరంగా చస్తుందీ?...అంతా అగమ్య గోచరమయిందతనికి!...

—"ఏమిటీ వెధవఅలకా నువ్వూను? ...ఆ అన్నం అలా పాడయిపోతున్నాది. తినేయి!... ఈ కరువురోజుల్లో అన్నం ఇలా తగలెట్టేస్తే ఎలా? బుద్ధిలేకపోతే సరి!" అన్నాడు రామం. అంత కఠినంగా అనడం రామానికి అస లిష్టంలేదు. ఆమెను బ్రతిమాలుకోవాలనే ఉద్దేశం మనస్సులో ఉంది. కానీ అలా బ్రతిమాలుతే ఆమెదగ్గర తను ఓడిపోయినట్లే అవుతుందని, అలా అన్నాడు!

నిజానికి అరుణకి ఆకలేస్తున్నాది. అన్నం తినాలనీ ఉంది. ఆ క్షణంలో భర్త తన్ని బ్రతిమాలుకున్నట్లయితే, ఓ మరతు మీద అన్నం తినేసేఉండేది. కానీ భర్త తనని బ్రతిమాలందే తినేస్తే తను ఓడిపోయి నట్టేగా మరి! మనస్సులో ఎంతో పుడు క్కుందామె. ఆఖరికి తెగించి అంది.—

"ఆ పైడే తినేస్తుంది. ఇక అదే వండేస్తుంది. ఏమయినా మీరు దానిపక్షంగా," అంది వెక్కుతూ.

"పొరబడుతున్నావు." అని రామం గబగబా మళ్ళీ వీధులోకి వెళిపోయేడు. అనవ సరంగా అనేక అపోహాలు బయలుదేర తున్నందుకు ఎంతో బాధపడ్డాడు. ఏం చెయ్యడం?... పైడిని బ్రతిమాలుకొని, దానినెలా అయినా ఒప్పించి మానిపించేయ డమే ఉత్తమం. తిన్నగా దానింటికెళ్ళేడు.



"పైడీ, ఈవిషయమై నిన్ను అడుక్కోవలసివచ్చింది. నెల నెలకీ నీ కిస్తూఉన్న జీతం ఇచ్చేస్తూఉంటాను. నువ్వుమాత్రం మా ఇంటికి రావడం మానీయాలి. మా ఆవిడ పోరు భరించలేకుండాఉన్నాను." అని, అన్నాడు రామం.

"ఏటంటారు?... మీ రిచ్చే డబ్బు నాకు వద్దనుకున్నానే? నా మాట నెగ్గాల!... ఆ యమ్మ నన్నెలా మానిపించేస్తుందో చూత్తానుగా!" అంది పైడి.

"నిన్ను బ్రతిమాలుకుంటాను పైడీ!... మానీవూ? ప్రస్తుతం నీకు ఏభైరూపాయలు కూడా ఇచ్చుకుంటాను." అన్నాడు మళ్లీ.

"మీడబ్బు ఎవరిక్కావాలని ఎన్నిసార్లు చెప్పేను? నామాట నెగ్గాల!" అంది మొండిగా.

పైడిమీద ఎంతో కోపం వచ్చింది రామానికి. "అంత మొండితన మేమిటి? తల్చుకుంటే నిన్ను నిలువునా కాల్పించేస్తాను తెలుసా!" అన్నాడు రామం కోపం ఆపుకోలేక.

"ఆ! ఏటి చేస్తావు?... నిన్నే కాల్పించేస్తాను. నీసంగతెవరికి తెలీదనుకున్నావు?......మహా నీతిమంతుడిలా మాట్లాడుతున్నావు!......" అంటూ తనకున్న గొంతుకనంతా వినియోగించి పూర్వ విషయాలన్నీ గోల చెయ్యడం మొదలుపెట్టింది. దాని గొంతుక విని నలుగురూ చుట్టూ మూగేరు. రామానికీ లక్ష్మికీ గల సంబంధాన్ని అంతా ఏకరువు పెట్టేసింది. అందరూ ముక్కులమీద వ్రేళ్ళేసుకున్నారు. రామం అక్కడ మరి నిలబడలేకపోయేడు. తలవంచుకొని అక్కడినుంచి వెళ్లిపోయేడు. అలా సముద్రపొడ్డున చాలా దూరం వెళిపోయేడు. మనుష్యులెవరూ అగుపించనిదగ్గరకు పోయి కూర్చున్నాడు. లక్ష్మిభర్తకూడా అక్కడికి వచ్చేడే!... వట్టి మూర్ఖుడు, అనుమానపు మనిషి!! ఇక లక్ష్మి బ్రతుకేం కావాలి?... తన భార్య అరుణకు కూడా ఆ విషయమై తెలుస్తుంది. తనమీద నమ్మకం ఆమెకు పోతుంది. పైగా తనని చూచి అసహ్యించుకుంటుంది కూడా! తను మళ్లీ ఏముఖం పెట్టుకొని ఊళ్లోకి వెళ్లగలడు? ఊళ్లో వారు తనని వ్రేలెట్టి చూపుతారే?... అలా ఆలోచిస్తూ కూర్చున్నాడు. అలా ఎంతసేపు కూర్చున్నాడో అతనికి తెలియలేదు.

పొరిగింటి కామయ్యగారూ, ఇంకో ఇద్దరూ వచ్చి "ఇక్కడిలా కూర్చున్నావేం?... నీకోసం ఊరంతా గాలించేస్తున్నాము?... పోలీసులకు కూడా తెలుబడి చేసేము! ఔనుగానీ, ఆ కాపముండ నోటికొచ్చినట్లు కూసిందని ఇంతలా విచారించాలా? దాని మాటలు మేం నమ్మేస్తామనుకున్నావేమిటి?!.....పద ఇంటికి." అంటూ కామయ్యగారు వీపుతట్టి లేపేవరకూ వాస్తవిక జగత్తులోకి రాలేకపోయేడు రామం. అడుగులు బరువుగా వేస్తూ క్రుంగిపోయిన హృదయంతో వాళ్లతో వెళ్ళేడింటికి.

ఆందోళనతో గుమ్మంలో కాచుకు కూర్చొనుంది అరుణ. భర్తని చూడడంతోనే ఆమెముఖంలో ఆందోళన మాయమయింది......"ఔనుగానీ ఇంత రాత్రి వరకూ ఎక్కడికి వెళిపోయేరు. ఆ వెధవ ముండ ఎలాంటిదో చూచేరా? మిమ్మల్నే నానామాటలూ అంది. లేనిపోనివన్నీ కల్పించింది. ఏమయినా రాక్షసిముండది. అదలా అబద్ధకల్పనలు చేసి, లక్ష్మితో మీకు సంబంధం ఉందంటే నమ్మేస్తాననుకుంది కాబోలు!... ఇంతకీ అదలా మిమ్మల్ని అందని ఇంటికే రావడం మానీసేరేం?... ఇంతవరకూ ఎంత భయపడ్డానో తెలుసా? అమ్మయ్య ఇప్పటికి నా మనస్సు స్థిమితపడింది." అంది అరుణ తొందర తొందరగా మాటల్ని సగం మింగేస్తూ.

రామం మరేమీ మాట్లాడలేదు. తిన్నగా ఇంట్లోకి వెళ్లిపోయేడు.

రామం భోజనం చేస్తున్నప్పుడు అంది అరుణ—"మిమ్మల్ని అనవసరంగా అపార్థం చేసుకున్నాను, కాపదానితో మీకు సంబంధం ఉన్నాదని...క్షమించరూ?" అంది అరుణ దీనంగా.

"ఒక్కొక్కప్పుడు, ఇలాంటి చిన్న విషయాలలో అనేక అపార్థాలు వస్తూ ఉంటాయి!... దానికేం లే!" అన్నాడు రామం చెయ్యి కడుక్కుంటూ!

ఆ రాత్రి రామానికి సరిగ్గా నిద్రపట్టలేదు. ఎన్నో పాడుకలలొచ్చేయి. లక్ష్మి భర్త ఆమెను కొరడాతో కొడుతున్నట్లు, 'రంకులాడీ, నీభరతం పడతానుండు' అన్నట్లు పీక పిసుకుతున్నట్లు, అన్నం పెట్టకుండా నానా బాధలూ పెడుతున్నట్లు. ఆఖరికి ఆ బాధలు పడలేక లక్ష్మి నూతులో పడి చనిపోయినట్లూ,—ఈరకంగా పాడుకలలొచ్చింది. ఎంతో భయపడ్డాడా రాత్రి రామం.

కన్నకల నిజమయేరోజు వచ్చింది. లక్ష్మిశవాన్ని ఆసుపత్రికి తీసుకపోయేరు. కన్నీరు కార్చడం తప్ప వేరేమీ చేయలేకపోయేడు రామం.

ఎప్పుడో మాటుగా జరిగిన విషయం, బయటకు వచ్చి అలాంటి విచిత్రపరిణామాన్ని తీసుకొస్తుందని అనుకోలేదు రామం.


## రు. 100 బహుమానం

(గవర్నమెంటు రిజిస్టరు)

తెల్ల వెంట్రుకలను అంత మొందించండి. రంగులు వాడకండి మా ఆయుర్వేద సువాసన "సెంట్రల్ మోహిని ఆయిల్" 60 ఏళ్లదాకా నల్లగా ఉంచును ఇది మీ దృష్టిని వృద్ధిపరచి తల నొప్పిని కుదుర్చును. కొన్ని వెంట్రుకలు తెల్లబడితే రూ. 2-8-0 తో ఒక సీసా (మూడు ఒకసారి 6-8-0) కొనండి. సగము తెల్లబడితే 3-8-0 (మూడు ఒకసారి 9-0-0.) తలంతా తెల్లబడితే రు. 5-0-0 (మూడు ఒకసారి రు. 12) కొనండి. ఇది అబద్ధమని ఋజువుచేసిన వారికి రు. 100 బహుమానం. పూర్ణ విశ్వాసానికి అణాన్నర స్టాంపు పంపి గ్యారంటీ తీసుకొనండి.

**Bharat Kalyan Aushadhalaya**

Post Bag No 6725 Calcutta (A P)